క్లుప్తంగా

గండికి పాదయాత్ర



రామచంద్రయ్య పాదయాత్రకు సంఘీభావం తెలిపిన టీడీపీ నాయకులు

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామానికి చెందిన టీడీపీ రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పుత్తా రామచంద్రయ్య శనివారం భాకరాపేట సమీపంలోని ఎల్లమ్మ గుడి వద్ద నుంచి శ్రీ గండి క్షేత్రం ఆంజనేయ స్వామిని దర్శించుకునేందుకు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా పుత్తా రామచంద్రయ్య మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చినందున మొక్కుబడిని చెల్లించుకునేందుకు ఈ యాత్ర చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ తెలుగు యువత ఉపాధ్యక్షుడు కుప్పాల వెంకటసుబ్బయ్య, టీడీపీ నాయకులు చెంచయ్య నాయుడు, చంద్ర, నాగముని రెడ్డి, రామ్మోహన్, రాటాల రామయ్య, బీజేపీ నాయకుడు భాస్కర్‌రెడ్డి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న నేతలు



గంగనేరు క్వార్టర్స్‌లోని మస్తాన్‌వలి దర్గాలో మొక్కులను తీర్చుకుంటున్న టీడీపీ శ్రేణులు

రామాపురం: సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం రాయచోటి శాసనసభ్యులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి గెలుపొందాలన్న తమ కోరికలు నెరవేరడంతో శనివారం టీడీపీ నేతలు మొక్కులు చెల్లించుకున్నారు. రాచపల్లి గ్రామ పంచాయతీ గంగనేరు క్వార్టర్స్‌లోని మస్తాన్‌వలి దర్గాలో, గండి ఆంజనేయ స్వామి సన్నిధిలో మండల తెలుగు యువత సెక్రటరీ షేక్ ఖాశింపీరా, పార్టీ నాయకులు మొక్కులు చెల్లించుకున్నారు.

సింగిల్ విండో అధ్యక్ష పదవికి రాజీనామా




పాలగిరి సుధాకర్ రెడ్డి

నందలూరు : కో–ఆపరేటివ్ సొసైటీ సంఘం సింగిల్ విండో అధ్యక్షుడు పాలగిరి సుధాకర్ రెడ్డి తన పదవికి శనివారం రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని ఆ శాఖ ఉన్నతాధికారులకు అందజేశారు.

బాధితులకు పరామర్శ

రాయచోటి: రాయచోటి రూరల్, మండల పరిధిలో టీడీపీ నాయకులు, కార్యకర్తల దాడులలో గాయపడిన వైఎస్‌ఆర్‌సీపీ కార్యకర్తలు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. దాడులలో గాయపడిన కార్యకర్తలను మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఫోన్ ద్వారా పరామర్శించారు. రాయచోటి రూరల్ మండలం, ఎండపల్లి గ్రామం, బోయనపల్లెలో ఈనెల 5వ తేదిన ఎమ్మెల్యే రాంప్రసాద్ రెడ్డి సమక్షంలోనే దాడి సంఘటన చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ దాడిలో రాయచోటి రూరల్ మండలం, మాజీ ఎంపీపీ పి సుబ్బారెడ్డి ఇంటిపైన, ఆయన అనుచరులపై టీడీపీకి చెందిన పలువురు కార్యకర్తలు, నాయకులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో పోలు వెంకటరామిరెడ్డితోపాటు మరి కొందరికి గాయాలయ్యాయి. దాడి సంఘటనపై టీడీపీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదుపై 16 మంది వైఎస్‌ఆర్‌సీపీ కార్యకర్తలపైన పోలీసులు కేసు నమోదు చేశారు.


మార్కెట్ యార్డ్ పదవులకు రాజీనామా



మురళీమోహన్‌రెడ్డి

రాజంపేట రూరల్ : మార్కెట్ యార్డ్ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు రాజీనామా చేసినట్లు ఉపాధ్యక్షులు ములక్కాయల మురళీమోహన్ రెడ్డి తెలియజేశారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మార్కెట్ యార్డ్ అధ్యక్ష పదవికి తన సతీమణి ములక్కాయల సుమిత్ర, ఉపాధ్యక్ష పదవికి తాను రాజీనామా చేసినట్లు తెలియజేశారు.

పీస్ కమిటీ సమావేశం



సమావేశంలో ప్రజలకు సూచనలు, సలహాలు ఇస్తున్న కడప దిశా డీఎస్పీ రమాకాంత్

ఒంటిమిట్ట : వైఎస్సార్ జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఆదేశాల మేరకు శనివారం మండల పరిధిలోని మంటపంపల్లి గ్రామంలో కడప దిశా డీఎస్పీ రమాకాంత్ గ్రామ పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ జనరల్ ఎలక్షన్స్, కౌంటింగ్ అయిపోయిన నేపథ్యంలో గ్రామాలలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించాలన్నారు. ఎటువంటి గొడవలకు పాల్పడకుండా మంచిగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట సిఐ, ఎస్‌ఐ, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కమనీయం.. వైభోగం



కలికిరి : గుండ్లూరులో వెలసిన మూలస్థానమ్మ



పెద్దతిప్పసముద్రం : శివ, పార్వతుల కల్యాణోత్సవ దృశ్యం



మదనపల్లె సిటీ : స్వామిని ఊరేగిస్తున్న భక్తులు



గుర్రంకొండ : స్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పెద్దతిప్పసముద్రం : శ్రీ ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో శనివారం శివ, పార్వతుల కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అరుద్ర నక్షత్రం సందర్భంగా ఆలయంలోని శివ పార్వతుల ప్రతిమలకు ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించారు. వేద పండితులు ఖన్నాస్వామి, పణితేజ స్వామి భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

భక్తిశ్రద్ధలతో మూలస్థానమ్మకు సిద్దపూజ

కలికిరి : మండలంలోని గుండ్లూరులో వెలసిన గ్రామదేవత మూలస్థానమ్మ ఆలయ వార్షిక ఉత్సవంలో భాగంగా శనివారం సిద్దపూజ నిర్వహించి తిరునాల ప్రారంభించారు. ఆదివారం ఉదయం నుంచి అమ్మవారికి బోనాల సమర్పణ, రాత్రికి చెక్క భజనలు, మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ చాందినీ బండ్లు ఊరేగిస్తారు. 10న సోమవారం రాత్రి మూలస్థానమ్మ పుష్పపల్లకీ సేవ, గ్రామోత్సవంతో తిరునాల ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు. కాగా ఉత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు పాలేటమ్మ తిరునాల

మండలంలోని గుట్టపాళెం కస్పాలో వెలసిన గ్రామదేవత పాలేటమ్మ తిరునాల ఆదివారం ప్రారంభమవుతుందని ఆలయ నిర్వాహకులు బాలరెడ్డెప్ప తెలిపారు. ఉదయం పాలేటమ్మ మెట్టినిల్లు వారి సిద్దపూజ, నగిరి బోనం, అనంతరం పుట్టింటి వారు, గ్రామస్తులు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారని తెలిపారు. రాత్రి చాందినీ బండ్లు ఊరేగింపు, సోమవారం ఉదయం సాయంత్రం కల్లిపాటు ఉత్సవంతో తిరునాల ముగుస్తుందని, భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

శ్రీ లక్ష్మీనరసింహునికి విశేష పూజలు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ ఆధ్వర్యంలో ఆలయంలో విశిష్టమైన పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. తోమాల సేవ, ఏకాంత సేవ కావించారు. ఈ సందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామి వారిని సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో ప్రాకారోత్సవం

మదనపల్లె సిటీ : స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో శనివారం ప్రాకారోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామికి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం భక్తులు స్వామిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ రమణ, మాజీ చైర్మన్ బింగి పాండు, అర్చకులు గోవర్ధన్‌భట్టార్ పాల్గొన్నారు.

ఆలయాలలో విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ ఆంజనేయస్వామి మూలవిరాట్

చిన్నమండెం : మండలవ్యాప్తంగా పలు ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శనివారం కావడంతో స్వామి వారి మూలవిరాట్‌మూర్తిని పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామి వారికి ఆకుపూజలు, సింధూర పూజలు, పలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

నేటి నుంచి మహాభారత యజ్ఞం



పాండవుల విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్న కమిటీ సభ్యులు

రామాపురం : మండల కేంద్రంలో ఏటా మహాభారత యజ్ఞాన్ని అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా మహా భారత యజ్ఞాన్ని నిర్వహించేందుకు శనివారం మహాభారత యజ్ఞానికి అంకురార్పణ చేశారు. పంచ పాండవులు, ద్రౌపదీ మాత, పోతుల రాజు పలు విగ్రహాలను రామాపురంలోని చుట్టుపక్కల గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. మహాభారత యజ్ఞాన్ని 18 రోజుల పాటు నిర్వహిస్తారు. పగటి సమయంలో హరికథను, రాత్రి సమయంలో మహాభారత యజ్ఞాన్ని కళాకారులచే ప్రదర్శిస్తారు. ఈ మహాభారత యజ్ఞానికి ప్రతి ఏడాది విశేష స్పందన లభిస్తోంది. మండల కేంద్రంలోని ఈ మహాభారత యజ్ఞాన్ని ఏర్పాటు చేయడంతో చుట్టుపక్కల గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. మహాభారత యజ్ఞం కమిటీ సభ్యులు మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మద్దిరేవుల రమేష్‌రెడ్డి, సర్పంచ్ అయోధ్యపురం నాగభూషన్‌రెడ్డి, సహకార సంఘం అధ్యక్షులు పెద్దిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, భక్తవత్సలరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ధర్మారెడ్డి, నారాయణ తదితరులు మహాభారత యజ్ఞం ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ మహాభారత యజ్ఞం జరుగుతున్న రోజులు మధ్యాహ్నం ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నారు. మహాభారత యజ్ఞానికి అందరూ సహకరించాలని కమిటీ చైర్మన్ రమేష్‌రెడ్డి తెలిపారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి



సిద్దవటం పోలీసు స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ పెద్ద ఓబన్న

సిద్దవటం : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగిసిందని ప్రతి ఒక్కరూ గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సిద్దవటం ఎస్ పెద్ద ఓబన్న తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని పోలీసు స్టేషన్‌లో శనివారం సాయంత్రం పలువురికి ఎస్‌ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ మంచి వాతావరణంలో జీవించాలని, ఘర్షణలు, హింసాత్మక ఘటన జోలికి వెళ్లి సమస్యలను తెచ్చుకోవద్దని సూచించారు. మండల పరిధిలో ఏవైనా సమస్యలు వస్తే స్థానిక పోలీసులకు సమస్య చెప్పాలని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హామీని గుర్తుచేస్తే ఉలికి పాటు ఎందుకు?



సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

మదనపల్లె : మదనపల్లెను జిల్లా కేంద్రం చేస్తామన్న టీడీపీ అధినేత చంద్రబాబు హామీని గుర్తుచేస్తే... ఆ పార్టీ నాయకులకు ఉలికిపాటు ఎందుకని బహుజన సమాజ్‌పార్టీ (బీఎస్పీ) నాయకులు ప్రశ్నించారు. శనివారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షులు జేసీ.రమణ, జిల్లా ఇన్‌చార్జ్ బాలాజీ, నాయకులు శ్రీనాథ్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు మదనపల్లె ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని తాము కోరితే... గుర్తింపు కోసం ఆరాటపడుతున్నారంటూ టీడీపీ నాయకులు ఆర్.జే.వెంకటేష్ విమర్శించడం హాస్యాస్పదమన్నారు. బీఎస్పీ, టీడీపీలా ప్రాంతీయపార్టీ కాదని, జాతీయపార్టీ అని, అందుకే సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలకు ఎన్నికల సంఘం ఈవీఎంలలో బీఎస్పీ ఏనుగు గుర్తుకు మొదటిస్థానం కేటాయించిందన్నారు. గతంలో బీఎస్పీ ఆధ్వర్యంలో జరుగుతున్న మదనపల్లె జిల్లా ఉద్యమంలో తనకు అవకాశం కల్పించాలని పదే పదే ప్రాధేయపడిన ఆర్.జే.వెంకటేష్, అధికారంలో వచ్చాక విర్రవీగడం తగదన్నారు. అంబేద్కర్, కాన్షీరామ్ సిద్ధాంతాలతో, బహుజనల అభివృద్ధి కోసం ఆత్మగౌరవంతో బీఎస్పీ పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు సంధ్య, శివ, మహేష్, బద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డైరెక్టర్ పదవికి రాజీనామా





రాజీనామా చేస్తున్న నక్కా చంద్రశేఖర్, రాజారెడ్డి

పీలేరు రూరల్ : ఆంధ్రప్రదేశ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఆర్టీసీ) డైరెక్టర్ పదవికి రాజీనామా చేసినట్లు ఎ. రాజారెడ్డి తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తన రాజీనామా పత్రాన్ని ఆర్టీసీ స్టేట్ సెక్రటరీకి పంపినట్లు తెలిపారు.

సింగిల్‌విండో చైర్మన్ రాజీనామా

గుర్రంకొండ : గుర్రంకొండ సింగిల్‌విండో చైర్మన్ నక్కా చంద్రశేఖర్, డైరెక్టర్లు నీళ్ల శ్రీనివాసులు, సింగంశెట్టి రెడ్డికుమార్ రాజీనామా చేశారు. శనివారం రాజీనామా పత్రాలను సింగిల్‌విండో సీఈఓ అనిల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ పదవులకు రాజీనామాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాజీనామా పత్రాలను జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తామని సీఈఓ పేర్కొన్నారు.

• వర్షం.. కష్టం



ఆర్టీసీ బస్టాండులో నిలిచిన వర్షపు నీరు

మదనపల్లె సిటీ : మదనపల్లెలో మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో పలు ప్రాంతాల్లో రోడ్లపై వర్షపునీరు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు మురుగునీరు రోడ్లపై పొంగిపొర్లుతోంది. దుర్వాసనకు ప్రజలు అల్లాడిపోతున్నారు. స్థానిక పటేల్ రోడ్డు అబ్బన్నవీధి వద్ద మురుగునీటి కాలువ పొంగిపొర్లుతుంది. శుక్రవారం రాత్రి కురిసిన వర్షం పటేల్‌రోడ్డు వద్ద జలమయంగా మారింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండు,ఎంఎల్ఎల్ ఆస్పత్రి ప్రాంతాల్లో వర్షపునీరు మడుగులా మారిపోయింది. డ్రైనేజీ కాలువలు దెబ్బతినడంతో వర్షం కురవడంతో మురుగునీరు కలిసి మడుగుల్లా మారుతున్నాయి. డ్రైనేజీ కాలువలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా ఎల్లమ్మ జాతర



పూజలు అందుకుంటున్న ఎల్లమ్మతల్లి



మహా అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

పెనగలూరు (ఓబులవారిపల్లి) : మండల కేంద్రమైన పెనగలూరులో శనివారం ఎల్లమ్మతల్లి జాతర ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు అధిక సంఖ్యలో కుంకుమ, పసుపు, గాజులు వస్త్రాలు తీసుకువచ్చారు.

5 వేల మందికి అన్నదానం

జాతర సందర్భంగా గ్రామస్తుల సహకారంతో ఐదు వేల మందికి అన్నదానం నిర్వహించినట్లు పురోహితుడు చెంచు సుబ్బనరసయ్య తెలిపారు. సాయంత్రం ఊరేగింపు, రాత్రికి ఎల్లమ్మ ఆసాదుకథ నిర్వహించారు. వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలకు ముందు వచ్చే ఆదివారం ఈ జాతర నిర్వహించడం ఆనవాయితీ. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు.

డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

వాల్మీకిపురం : 2024–25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చేరి తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. అడ్మిషన్లు కొరకు ఆయా మండలాల్లోని డిగ్రీ కళాశాలల్లో సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ పెద్దప్ప రాజు, కోఆర్డినేటర్ డాక్టర్ నారాయణస్వామి, పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనే లక్ష్యం

కలకడ : క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తున్నామని వైద్యాధికారి మహమ్మద్‌రఫీ తెలిపారు. ఆరు వర్గాలుగా విభజించి బీసీజీ టీకాలను వందశాతం పూర్తి చేయడానికి సిబ్బంది కృషి చేయాలని సూచించారు. శనివారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని మండెంవారి పల్లె, గొళ్లపల్లె గ్రామాల్లో టీబీని నిర్మూలించేందుకు బీసీజీ టీకా ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, సుబ్బరత్న, ఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మిట్స్ విద్యార్థుల సత్తా



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

కురబలకోట : గూడూరు నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన జాతీయ స్థాయి ప్రాజెక్టు ఎక్స్‌పో పోటీల్లో అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం బిటెక్ విద్యార్థు లు జి. జుబేర్, వి. ధామస్, కీర్తి, నవాజ్, ప్రవ ల్లిక, రమేష్, హేమంత్, జాహ్నవి సత్తా చాటారు. ఈ పోటీల్లో మొదటి రెండు బహుమతులతో పాటు ద్వితీయ బహుమతిని కూడా గెలుపొందినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. స్మార్ట్ సస్టైనబుల్ కూలర్, స్మార్ట్ హెల్మెట్, సోలార్, ఫెడల్ ఆపరేటెడ్ మిల్లెట్స్ గ్రైండింగ్ మిషన్లు కనిపెట్టి అందర్ని ఆకర్షించారన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు



విజేత విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

చిన్నమండెం : చిన్నమండెంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలు ముగిసినట్లు గ్రంథపాలకుడు ఆంజనేయులురెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కథలు చదివించడం, ఆటలు ఆడించడం, క్యారమ్ బోర్డు, చెస్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు తదితర బహుమతులను ప్రదానం చేశారు.

గాలివీడు : గ్రంథాలయం వేసవి శిక్షణ శిబిరాలు శుక్రవారంతో ముగిశాయని గ్రంథాలయం శాఖ అధికారి రామచంద్రనాయక్ తెలిపారు. వేసవి శిక్షణలో భాగంగా కథలు చదవడం, చిత్రలేఖనం, యోగా, తెలుగు పద్యాలాపనపై తరగతులు, నీతి కథలు, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు, క్విజ్ పోటీలు, చేతి రాతపై శిక్షణను నిర్వహించారు. అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన విద్యార్థులకు బహుమతులను అందించినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా ప్రపంచ మహాసముద్రాల దినోత్సవం



బహుమతులు అందజేస్తున్న ఎన్‌సీసీ కేర్‌టేక్ ఆఫీసర్ రవీంద్రారెడ్డి

వాల్మీకిపురం : స్థానిక పీవీసీ ప్రభుత్వ పాఠశాలలో 35 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రపంచ మహాసముద్రాల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ కేర్‌టేక్ ఆఫీసర్ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ మహా సముద్రాలు మానవాళికి ఎంతగానో దోహద పడుతున్నాయని, వాటిని కలుషితం చేయడం మనకే నష్టమని, ప్లాస్టిక్ వ్యర్థాలు, పారిశ్రామిక మురుగు సముద్రంలో కలవకుండా చూడాలని అన్నారు. ప్రజలు దీనిపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం ఎన్‌సీసీ విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు నాగరాజ, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణం పరిరక్షణ అందరి బాధ్యత

మదనపల్లె సిటీ : పర్యావరణం పరిరక్షణ అందరి బాధ్యత అని ది మదనపల్లె టౌన్ అపెక్స్‌వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గొల్లపూడి తిరుపతిరావు ఓ ప్రకటనలో తెలిపారు. మొక్కలు నాటి పర్యావరణం కాపాడాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున మొక్కలు నాటే కార్యక్రమంపై అందరూ దృష్టి పెట్టాలన్నారు. వేసవిలో గతంలో ఎన్నడూ లేని విధంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలో భారీ వృక్షాలు, చెట్లు కొందరు అక్రమంగా నరికివేసినట్లు పేర్కొన్నారు.

• గిజిగాడి కళ

అందంగా గూడు నిర్మించడంలో గిజిగాడికి సాటిరారెవరు. గిజిగాడి గూడు అమరిక, నేర్పరితనం, కళాత్మక నైపుణ్యం అబ్బురం. సన్నటి గడ్డిపరకలతో అందంగా గాలి ఊయల లాగా గూళ్లను నిర్మించుకోవడం వీటి ప్రత్యేకత. గ్రామాల్లో వీటి గూళ్లు ఈత చెట్ల కొమ్మలకో.. తాటి చెట్లకో.. తుమ్మ చెట్లకో వేలాడుతూ ఆకట్టుకుంటాయి. కొమ్మలకు వేలాడుతున్న గుజిగాడి గూళ్లు అందరినీ మైమరపింజేస్తాయి. మండల కేంద్రమైన గుర్రంకొండలో ఈత చెట్టు మట్టలకు గుజిగాడి గూళ్లు కనిపించాయి. చెట్టు నిండా గూళ్లు వేలాడుతూ చూపరులను కనువిందు చేస్తున్నాయి. పాములు, గద్దల నుంచి గుడ్లు, పిల్లలను రక్షించుకునేందుకు అనేక జాగ్రత్తలు తీసుకుంటాయి ఈ పక్షులు. ఈ అరుదైన దృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

– గుర్రంకొండ

